విశాలాంధ్ర గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమగోదావరి

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి

విశాలాంధ్ర-భీమవరం: ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడానికి జిల్లా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ పి .ప్రశాంతి అన్నారు. శుక్రవారం స్థానిక కలెక్ట రేట్ స్పందన సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ ఎస్. రామసుందర్‌రెడ్డితో కలిసి ఉద్యోగుల గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల ఉద్యోగుల నుండి విజ్ఞాపనలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగులు మరింత స్వేచ్ఛగా పనిచేయడానికి ఉద్యోగుల గ్రీవెన్స్ కార్యక్రమం తోడ్పడుతుందన్నారు. ఉద్యోగులకు ఉన్న సర్వీస్ సమస్యలు పరిష్కారమైతే వారు మరింత స్వేచ్ఛాయుత వాతావరణంలో పని చేయడానికి దోహదపడుతుందన్నారు. ఈ విషయమై జిల్లా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి ఆయా శాఖల ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. శుక్రవారం నిర్వహించిన ఉద్యోగుల గ్రీవెన్స్ కార్యక్రమంలో 10 దరఖాస్తులను స్వీకరించినట్లు తెలిపారు.

పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు

విశాలాంధ్ర-ఏలూరు క్రైమ్: జిల్లాలో శనివారం జరిగే పంచాయతీ సాధారణ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేలాగా పటిష్టమైన భద్రతా చర్యలను చేపట్టినట్లు జిల్లా ఎస్పి డి. మేరీ ప్రశాంతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలింగ్ కేంద్రాలు, కౌంటింగు కేంద్రాల వద్ద పటిష్ట బందో బస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల దూరం వరకు ఓటర్లకు తప్ప ఇతరులకు అనుమతి లేదన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఏ విధమైన ప్రచారాలు చేయరాదని, ఓటర్లు నిర్భయంగా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఓటర్లను భయభ్రాంతు లకు గురి చేయడం, ప్రలోభాలకు గురి చేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శనివారం ఉదయం గం.7 నుంచి మధ్యాహ్నం 1 వరకు పోలింగ్ ప్రక్రియ జరుగుతుందన్నారు. కౌంటింగ్ ప్రక్రియ కూడా మధ్యాహ్నం గం. 2నుండి నిర్వహిస్తారన్నారు. పోలింగ్ కేంద్రాల చుట్టుప్రక్కల ప్రాంతాలలో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేకమైన భద్రతా చర్యలు తీసుకుని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా చర్యలు తీసుకున్నామన్నారు.

వివాహిత హత్య

విశాలాంధ్ర- ముసునూరు: ముసునూరు మండలంలో మహిళ దారుణ హత్యకు గురైంది. ముసునూరు ఎస్ఐ యం.కుటుంబ రావు తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు జిల్లా నూజివీడు డివిజన్ ముసునూరు మండలం చిల్లబోయిన పల్లి గ్రామానికి చెందిన ఓలేటి రవీంద్ర భార్య ఓలేటి మణి (30) దారుణ హత్యకు గురైంది. గురువారం వరి పొలంలో కలుపు తీసేందుకు వెళ్లింది. సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చి భోజనం చేస్తున్న సమయంలో ఆమెను గుర్తు తెలియని వ్యక్తి తల పై నరికి పారిపోయాడని, భర్త కేకలు వేస్తూ ,చుట్టు ప్రక్కల వారిని పిలవగా,వారు వచ్చేసరికే ఆమె ప్రాణం పోయింది.ఆమెకు బలంగా దెబ్బలు తగలడంతో మృతి చెందింది. కుటుంబ కలహాల నేపథ్యంలో భర్తే హత్య చేసి వుంటాడని, గ్రామస్తులు, పరిసరప్రాంతాల వారు అనుమానిస్తున్నారు.మృతు రాలికి ఇంటర్ చదివే కుమార్తె, 9వ తరగతి చదువుతున్న కుమారుడు ఉన్నారు. సమాచారం అందుకున్న నూజివీడు రూరల్ సిఐ అర్.అంకబాబు, ఎస్ఐ యం.కుటుంబరావు, సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని నూజివీడు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నూజివీడు డిఎస్పీ అశోక్ కుమార్‌గౌడ్ సంఘటన స్థలాన్ని పరిశీలించి, మృతురాలి భర్తను దర్యాప్తు చేయగా, అనుమానాస్పద మృతిగా చిత్రీకరించేందుగా ప్రయత్నం చేసే సమయంలో భర్తే హత్య చేసినట్టు పోలీసుల విచారణలో తేలింది. కేసు నమోదు చేసి రిమాండ్‌కి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడి మృతి

విశాలాంధ్ర-కొయ్యలగూడెం : తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన కొయ్యలగూడెంలో శుక్రవారం చోటు చేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం మలకపల్లి గ్రామానికి చెందిన మద్దుకూరి రవి (25) అతని స్నేహితుడు కొతారి వంశీ జంగారెడ్డిగూడెం నుండి ద్విచక్ర వాహనమైన స్కూటీపై వారి స్వగ్రామం మలకపల్లి వెళుచుండగా కొయ్యలగూడెం ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా వైజాగ్ నుండి తెలంగాణ రాష్ట్రం ఖమ్మం వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో మద్దుకూరి రవి అక్కడికక్కడే మృతి చెందాడు. స్నేహితుడు వంశీ కి స్వల్ప గాయాలు కావడంతో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందించి, మృతిచెందిన మద్దుకూరి రవి మృతదేహాన్ని జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జిజే విష్ణువర్ధన్ పేర్కొన్నారు.

అఖిలపక్షం నూతన కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర - వేలేరుపాడు : మండలంలోని వివిధ రాజకీయ పార్టీలు, కుల, ప్రజా సంఘాలు కలిసి నూతన అఖిలపక్ష కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో సమావేశమైన అఖిలపక్షం 31 మందితో నూతన కమిటీని ఏర్పరచుకున్నారు. ఆ కమిటీ అధ్యక్షుడిగా సోయం చంద్రరావు (సిపిఐ ఎంఎల్ ప్రజాపందా), కార్యదర్శి బాడిశ రాము (సీపీఐ), సహాయ కార్యదర్శులు ధర్మల రమేష్ (సిపిఎం), గణేశుల ఆదినారాయణ (జనసేన), ఉపాధ్యక్షులుగా కొల్లూరి సత్తిపండు (కాంగ్రెస్), శాఖమురి సంజీవులు (టీడిపి),ట్రెజరరీగా మడివి దుర్గారావు(సిపిఎం) ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి కొరకు సర్వం త్యాగం చేస్తున్న విలీన మండలాల్లోని నిర్వాసితుల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీరు ఏమాత్రం సరైనదిగా లేదన్నారు. చట్ట ప్రకారం నిర్వాసితులకు ఇవ్వాల్సిన ప్యాకేజీలు కల్పించవలసిన పునరావాసం ఏళ్ల తరబడి సాగుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

తహశీల్దార్‌కు వినతి పత్రం : గోదావరి వరదల వలన నష్టపోయిన కుటుంబాలకు ఇచ్చిన పరిహారం అందరికీ అందలేదన్నారు. దానిపై గతంలోనే తెలియజేశా మన్నారు. మళ్లీ దరఖాస్తులు తీసుకుని పరిశీలన చేస్తామని చెప్పి కూడా ఇప్పటివరకు ఏ గ్రామంలో దరఖాస్తు తీసుకోలేదని దీనిపై వెంటనే స్పందించాలని స్థానిక తహసిల్దార్ కు వినతి పత్రం అందజేశారు.

అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

విశాలాంధ్ర - గణపవరం: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల చెంతకు తీసుకువెళ్లాలని రాబోయే ఎన్నికల్లో వైసీపీ అఖండ విజయం చేకూరే విధంగా కృషి చేయవలసిన బాధ్యత గృహ సారధులు, సచివాలయ కన్వీనర్లపై ఉందని ఉంగుటూరు శాసన సభ్యులు పుప్పాల శ్రీనివాసరావు (వాసు బాబు) అన్నారు. శుక్రవారం గణపవరం కెవిపి కల్యాణ మండపంలో జరిగిన "మా నమ్మకం నువ్వే జగనన్న" జే.సి.యస్ నమోదు శిబిరం నిర్వహిం చారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా పాల్గొని ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు పార్టీ ఇస్తున్న భరోసా, భవిష్యత్తు కార్యాచరణ మీద దిశా నిర్దేశం చేసి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర కమిటీ సభ్యులు గాదరాజు వెంకట సుబ్బరాజు (పెద్దబాబు), ఎంపీపీ దండు వెంకటరామరాజు(అర్ధవరం రాము), జెడ్పీటీసీ సభ్యులు దేవరపు సోమలక్ష్మి, రాష్ట్ర సూర్య బలిజ కార్పొరేషన్ చైర్మన్ శెట్టి అనంతలక్ష్మి, దండు రాము, సంకు సత్య కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ ప్రచార యాత్ర జయప్రదం చేయండి

రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు దేగా ప్రభాకర్, జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య

విశాలాంధ్ర-ఏలూరు: రాష్ట్రాన్ని రక్షించండి, దేశాన్ని కాపాడండి అనే నినాదంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఐ రాష్ట్ర సమితి తలపెట్టిన ప్రచార బస్సు యాత్రను జయప్రదం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు దేగా ప్రభాకర్, సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య సిపిఐ శ్రేణులకు, జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో బస్సు యాత్ర గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేగా ప్రభాకర్, కృష్ణ చైతన్య మాట్లాడుతూ ఈ నెల 17 నుండి సెప్టెంబర్ 8 వరకు 26 జిల్లాలలో రాష్ట్రాన్ని రక్షించండి -దేశాన్ని కాపాడండి అంటూ సిపిఐ బస్సు యాత్ర రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ నాయకత్వాన జరుగుతుందని తెలిపారు. ఈ నెల17న విశాఖపట్నంలో బస్సు యాత్ర ప్రారంభమైందని 23న ఏలూరు జిల్లాలో ఉదయం గం. 11 గంటలకు టొబాకో కళ్యాణ మండపంలో పోలవరం సమస్యపై రౌండ్ టేబుల్ సమావేశం, సాయంత్రం గం.4లకు జంగారెడ్డిగూడెంలో పోలవరం నిర్వాసితుల, జిల్లా ప్రజల సమస్యలపై బహిరంగ సభ, 24వతేదీ ఉదయం గం.10లకు నూజివీడులో భూ సమస్యలపై భూ సదస్సు బస్సు యాత్ర సందర్భంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం పెరుగుతున్న ధరలను అరికట్టడంలో పూర్తిగా వైఫల్యం చెందాయని విమర్శించారు. ఏపికి ప్రత్యేక హెూదా, విభజన హామీలు అమలు చేయించడంలో రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తేవడంలో విఫలం చెందిందన్నారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి రాష్ట్ర అభివృద్ధిని వైసిపి ప్రభుత్వం విస్మరించిందన్నారు. మోడీ ప్రభుత్వం గత తొమ్మిది సంవత్సరాలుగా దేశ ప్రజలకు ముఖ్యంగా యువతకు, రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఘోరంగా వైఫల్యం చెందిందని విమర్శించారు. కార్మిక హక్కులను కాల రాస్తూ 44 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్స్ గా మార్చడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ, ఏఐటియుసి నాయకులు బండి వెంకటేశ్వరరావు, పుప్పాల కన్నబాబు, కె.కృష్ణమా చార్యులు, రెడ్డి శ్రీనివాస్ డాంగే, కడుపు కన్నయ్య, గేదెల నాగేశ్వరరావు, యర్రా వెంకటేశ్వర్లు, కనకం జగన్, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

జిల్లా ఎస్పి రవి ప్రకాష్

విశాలాంధ్ర- భీమవరం టౌన్: శనివారం జరగబోయే పంచాయతీ సాధారణ ఎన్నికల్లో భాగంగా పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్టు జిల్లా ఎస్ పి యు.రవి ప్రకాష్ అన్నారు. శుక్రవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలు, కౌంటింగ్ కేంద్రాలకు కనీసం 100 మీటర్ల దూరంగా ఓటర్లకు తప్ప ఇంకెవరికి అనుమతి లేదన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉందని సమస్య, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఓటర్లు తమ ఓటు హక్కును ప్రశాంతంగా వినియోగించుకోవచ్చని ఎస్పి తెలిపారు.

ఎంప్లాయి గ్రీవెన్స్‌లో 32 వినతుల స్వీకరణ

విశాలాంధ్ర-ఏలూరు: ఉద్యోగుల గ్రీవెన్స్ డే సందర్భంగా జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, ఉద్యోగినులు ఎదుర్కొంటున్న ఆయా సమస్యల పరిష్కారం కోసం అందజేసిన వినతులను జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ స్వీకరించారు. జిల్లాలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలపై స్థానిక కలెక్టరేట్ లో శుక్రవారం ప్రత్యేక ఎంప్లాయి గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్‌జివో, విఆర్‌ఓల సంఘం, సర్వే డిపార్ట్ మెంట్ సంఘం, పలు ఉద్యోగుల సంఘాల ప్రతినిధులు తమ సమస్యలపై వినతి పత్రాలు అందించగా, పలువురు ఉద్యోగులు ,ఉద్యోగినులు వ్యక్తిగత సమస్యలకు సంబంధించి వినతులను అందించారు. ఉద్యోగులు అందించిన వినతులపై జిల్లా కలెక్టర్ స్పందిస్తూ నిబంధనల మేరకు వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నుంచి ఎంప్లాయి గ్రీవెన్స్ కు 32 వినతులు అందాయి. ఈ సందర్భంగా ఉద్యోగులు, ఉద్యోగ సంఘాలు తెలిపిన ప్రతి అంశాన్ని ఎంతో ఓపికగా జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ విన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎపిఎన్ జిఓ సంఘ అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్, కార్యదర్శి నెరుసు రామారావు, శ్రీధర్ రాజు, కె. సత్యనారాయణ, మహిళా విభాగం కార్యవర్గ సభ్యులు జిల్లా కలెక్టర్ వారిని కలిసి ఉద్యోగులు, ఉద్యోగినులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ బి. లావణ్యవేణి, డిఆర్ఓ ఎవిఎస్ఎస్ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

మార్టేరులో ఆర్టీసీ పార్సిల్ కార్గో సర్వీస్

విశాలాంధ్ర - పెనుమంట్ర: మార్టేరులో పాలకొల్లు రోడ్డులోని సాయిబాబా గుడి ఎదురుగా భారత్ పెట్రోల్ బంక్ ప్రక్కన ఏపీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో పార్సిల్, కార్గో సర్వీస్‌ను నరసాపురం డిపో మేనేజర్ సత్తి సుబ్బన్న రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మేనేజర్ సత్తి సుబ్బన్న రెడ్డి మాట్లాడుతు ఇతర రాష్ట్రాలలో ఉన్న చెన్నై , బెంగళూరు , హైదరాబాద్ లో ఎంజీబీఎస్ , సిబిఎస్, కెపిహెచ్బి, బీహెచ్‌ఈఎల్ వంటి నగరాలు, ప్రాంతాలకు కొరియర్ సర్వీసులు ఇక నుండి అందుబాటులో ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో మానవతా జిల్లా కార్యదర్శి కొత్త సత్యనారాయణ మూర్తి, పడాల జగన్నాథ్ రెడ్డి, చిర్ల శ్రీనివాస్ రెడ్డి, కడలి సుబ్రహ్మ ణ్యం, ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ బస్సుయాత్ర గోడపత్రిక ఆవిష్కరణ

విశాలాంధ్ర-తణుకు: ఈనెల 22వ తేదీన తణుకులో ప్రవేశిస్తున్న సిపిఐ బస్సు యాత్రను, ఎన్టీఆర్ పార్కు వద్ద జరిగే సిపిఐ బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఐ పశ్చిమగోదావరి జిల్లా కార్య దర్శి కోనాల భీమారావు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో బస్సు యాత్ర గోడ పత్రికను విడుదలచేశారు. ఈ సందర్భంగా కోనాల భీమారావు మాట్లాడుతూ కేంద్రం, రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వాలు ప్రజా, కార్మిక, వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని గ్యాస్, పెట్రోలు, డీజిల్, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా ఆకాశాన్నంటుతున్నాయని విమర్శించారు. ధరలు నియంత్రించాల్సిన ప్రభుత్వాలు చోద్యం చూస్తున్నాయని ఎద్దేవా చేశారు. మహిళలపై అత్యాచారాలు, దళితులపైన దాడులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. మణిపూర్లో మహిళలు, ఆదివాసీల పైన జరిగిన అఘాయిత్యాలు అక్కడున్న బిజెపి ప్రభుత్వాలు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ, రాష్ట్ర సమస్యలు ప్రజల దృష్టికి తీసుకెళ్లేందుకు రాబోయే ఎన్నికల్లోఈ పార్టీలకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని కోరుతూ తణుకులో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తణుకు పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, రూరల్ మండల కార్యదర్శి టి. అప్పలస్వామి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం, సీతారాం ప్రసాద్, గారా ప్రసాద్, గోపాలకృష్ణ, బొద్దాని మురళి, రాధాకృష్ణ పాల్గొన్నారు.

వార్డు మెంబర్ల ఎన్నికను ప్రతిష్టగా తీసుకున్న పార్టీలు

భారీగా డబ్బు పంపిణీ

విశాలాంధ్ర - లింగపాలెం : లింగపాలెం మండలంలో పాచ్చానగరం, మఠంగూడెం పంచాయతీలలో ఒక్కొక్క వార్డు మెంబరుకు జరుగుతున్న ఉప ఎన్నికలను రాజకీయ పార్టీలు ప్రతిష్టగా తీసుకున్నాయి. పాచ్చానగరంలో 10వ వార్డుకు జరుగుతున్న ఉప ఎన్నికలో 197 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోబోతున్నారు. ఈ వార్డుకు జరిగే ఎన్నికలో అధికార వైసీపీ, ప్రతిపక్ష టీడీపీ అభ్యర్థులను పోటీలో ఉంచింది. శనివారం జరగబోయే ఎన్నికకు శుక్రవారం భారీగా డబ్బు ఖర్చు పెట్టారు. ఓటుకు వెయ్యి నుంచి రూ. 1500లు కూడా ఇవ్వటంతో ఎన్నికను ఎంత ప్రతిష్టగా తీసుకున్నారో ఊహించవచ్చు.

మఠంగూడెంలో ఎనిమిదవ వార్డుకు జరిగే ఉప ఎన్నికల్లో 227 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోబోతున్నారు. అధికార వైసీపీ, టీడీపీ-జనసేన మద్దతుతో అభ్యర్థులను పోటీలో ఉంచారు. వైసీపీ అభ్యర్థిపై పోటీ పెట్టడమే చర్చనీయాంశంగా ఉంది. ఇరువర్గాలు విజయం కోసం కృషి చేస్తున్నాయి. ఓటర్లను బట్టి డబ్బు పంచారు. ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలింగు కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ విధించారు.

సచివాలయ భవనం ప్రారంభం

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: మండలంలోని పేరంపేట గ్రామంలో రూ.40 లక్షల నిధులతో నిర్మించిన సచివాలయ భవనాన్ని,రూ. 21.80 లక్షలతో రైతు భరోసా కేంద్రాన్ని చింతలపూడి ఎమ్మెల్యే ఎలీజా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని రకాల సేవలు సచివాలయాల్లో అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. చిన్న అవసరం ఉన్నా వివిధ కార్యాలయాలకు ప్రజలు వెళ్లాల్సి ఉండేదని, కానీ ప్రస్తుతం సచివాలయాల్లో అన్ని రకాల సేవలు ప్రజలకు అందేలా ముఖ్యమంత్రి జగన్ సచివాలయాలను ఏర్పాటు చేసి పరిపాలనలో మార్పును తీసుకొచ్చారన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ కొదమ జ్యోతి, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, ఎంపీటీసీ ఇర్ల విజయశాంతి, సర్పంచ్ కంకిపాటి కుమారి తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేలో 9 గ్రామాలు పూర్తి

విశాలాంధ్ర-జీలుగుమిల్లి : జగనన్న భూ రక్ష భూ హక్కు మొదటి దఫాలో 9 గ్రామాలు రీ సర్వే పూర్తయ్యిందని జీలుగుమిల్లి తహసిల్దార్ జి. సుందర్ సింగ్ తెలిపారు. శుక్రవారం రామన్నపాలెం జాతీయ రహదారి ప్రక్కన రీ సర్వే బౌండరీ రాళ్లను ఏర్పాటు చేశారు. రీ సర్వే మొదటి దపాలు 15 గ్రామాలకు గాను 9 గ్రామాలు పూర్తయినట్లు ఆయన తెలిపారు. జాతీయ రహదారి రోడ్డు వెడల్పు 84 అడుగులు ఉంటుందని అన్నారు. రెండవ దఫాలో మిగిలిన గ్రామాలు రీ సర్వే ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ పి. సత్యనారాయణ రెడ్డి, జీలుగుమిల్లి సచివాలయ సర్వేయర్ అబ్రం సిబ్బంది పాల్గొన్నారు.

విద్యతోనే పేదరికం నిర్మూలన

పేదరికం నిర్మూలనకు, విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న గురువు యోహాను

విశాలాంధ్ర - లింగపాలెం : సమాజంలో పేదరికం తొలగిపోతే కష్టాలు ఉండవని, పేదరిక నిర్మూలనకు విద్య ప్రధానమని భావించి తనవంతు ప్రోత్సాహం, సహాయం అందిస్తున్నారు రంగాపురంనకు చెందిన కాట్రు యోహాను. పేద కుటుంబంలో పుట్టిన ఈయన చిన్ననాటి నుంచి కష్టాలను ఎదుర్కొని ఉన్నత చదువులు చదివి గురువుగా ఆస్ట్రియాదేశంలో పనిచేస్తూ జన్మనిచ్చిన గ్రామానికి సేవలందిస్తున్నారు. రంగాపురంలో సెయింట్ జాన్ వృత్తి విద్యా కేంద్రాన్ని నెలకొల్పి కంప్యూటర్ కోర్సు, కుట్టు, ఎంబ్రాయిడర్, ఇంగ్లీ షులో మాట్లాడే కోర్సులను ఉచితంగా నేర్పిస్తున్నారు. 2020లో ప్రారంభించిన ఈ కేంద్రంలో 110 మంది పేద విద్యార్థులు ఉచితంగా ఈ కోర్సులలో శిక్షణ పొందుతున్నారు. చదువుకునే పేద విద్యార్థులైన వారిని గుర్తించి ప్రతీ ఏటా ఆర్థిక సాయం కొన్నేళ్ళుగా అందిస్తున్నారు 25 మంది ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఈయన సహాయం చేస్తున్నారు.

పేదరికాన్ని అధిగమించి నాన్న ఆశయంతో సేవలు : రంగా పురంలోని స్వామినాదం (మద్దియ్య), సత్యవతి దంపతులకు జన్మించిన బిడ్డల్లో ఈయన ఒకరు. ఇద్దరు సోదరీలు, ఒక అన్నయ్య ఉన్న ఈ కుటుంబంలో పూట గడవటమే కష్టంగా ఉండేది. అమ్మా నాన్నలు నిరక్ష రాస్యులు.

రోజంతా కష్టపడినా ఇంటిల్లిపాది ఒక్కొక్కసారి అర్ధాకలితోనే ఉండే వారు. సాయం చేయటాన్ని చూసి చిన్నప్పుడే తాను కూడా కష్టాల్లో ఉన్న వారికి సాయం అందించాలనే తలంపు కలిగిందని ఫాదర్ యోహాను అన్నారు. ప్రభుత్వ స్కూలులో కష్టపడి చదివిన ఈయన ఎంఎబిఇడి చదివారు. ఎంఎలో ఇంగ్లీషు చేశారు. 2004లో ఆర్‌సిఎం సంస్థలో గురువుగా బాధ్యతలు స్వీకరించారు. మత గురువుగా ఉంటూ ఆస్ట్రియా దేశంలో సేవ చేసేందుకు 2016లో అవకాశం రావటంతో ఆ దేశానికి వెళ్ళారు. ఆ దేశానికి వెళ్ళిన ఈయన తాను పుట్టిన గడ్డకు సేవలం దించాలని భావించి సేవా కార్యక్రమాలు చేపట్టారు. సొంత ఊరిలో వీరికి ఉన్న ఎకరం పది సెంట్లను శిక్షణా కేంద్రానికి సేవా కార్యక్ర మాలకు కేటాయించారు. ఈయన అన్నయ్య జాన్‌రాజు సహకారంతో ఈ కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. తమకున్న స్థలంలో విశాలమైన భవనం వృత్తి విద్యా కోర్సులను నిర్వహించటాన్ని చూసిన వారంతా అభినందిస్తున్నారు. ఆస్ట్రియా దేశంలో ఈయనకు ఇచ్చే వేతనాన్ని సొంత గ్రామంలోని పేదల కోసం ఖర్చు చేస్తున్నారు. ఆస్ట్రియా దేశంలోని ఇన్ కంటాక్స్ అధికారిగా పనిచేసిన అలెగ్జాండర్, ఆంద్రియా దంపతుల ప్రోత్సాహంతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నానని గర్వంగా చెబుతుంటారు.

పంచాయతీ ఎన్నికలు, లెక్కింపునకు పగడ్బందీగా ఏర్పాట్లు

జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి

విశాలాంధ్ర-భీమవరం: పంచాయతీ ఎన్నికలు, కౌంటింగ్ ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఒక ప్రకటనలో తెలిపారు.గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియ శాంతియుత వాతావరణంలో వివాదాలకు తావులేకుండా నిర్వహించడానికి అన్ని ముందస్తు ఏర్పాట్లను పూర్తి చేశామన్నారు. ఒక సర్పంచ్ పదవికి, 10 వార్డు మెంబర్ల పదవులకు 19 వ తేదీ శనివారం ఉదయం గం.7 నుండి మ.గం.1వరకు పోలింగు, మధ్యాహ్నం గం.2 నుండి ఓట్ల లెక్కింపు ఉంటుందన్నారు. ఇరగవరం మండలం కావలిపురం సర్పంచ్ పదవికి, వార్డు మెంబర్ల పదవులకు వీరవాసరం మండలం మత్స్యపురి, పాలకోడేరు మండలం గొల్లలకోడేరు, పెనుగొండ మండలం దొంగరావిపాలెం, ఇరగవరం మండలం గోటేరు, పెనుమంట్ర మండలం మార్టేరు, తణుకు మండలం తేతలి, పాలకొల్లు మండలం గోరింటాడ, చింతపర్రు, పెంటపాడు మండలం కాసప పెంటపాడు, గణపవరం మండలం గణపవరం వార్డు మెంబర్ల పదవులకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మొత్తం ఓటర్లు 14,735 మంది ఉన్నారని, సర్పంచ్ పదవికి ఇద్దరు, 10 వార్డు మెంబర్లు పదవులకు 23 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నట్లు తెలిపారు. ఎన్నికలు సక్రమంగా సజావుగా నిర్వహించడానికి విధుల్లో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా ఉండి, ఎన్నికల విజయవంతానికి కృషి చేయాలని ఆ ప్రకటనలో జిల్లా కలెక్టర్ తెలిపారు.

బడి మానేసిన విద్యార్థులను గుర్తించి బడిలో చేర్పించాలి

జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్

విశాలాంధ్ర -ఏలూరు: ప్రతి వారికి విద్యను అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం విద్యా ప్రమాణాలను మెరుగు పరుస్తున్నట్లు జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో మిషన్ గ్రాస్ ఎన్విరాల్మెంట్ రేషియో(జిఇఆర్) జిల్లాస్థాయి సమీక్షా సమావేశం జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ జిల్లాలో పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు 2023-24 సంవత్సరానికి విద్యార్థుల డ్రాప్ అవుట్‌ను గుర్తించే సర్వేలో యంఇఓలు, యంపిడిఓ, స్కూలు ప్రధానోపాధ్యాయులు, వార్డ్ వాలంటీర్లు, కాలేజి ప్రిన్సిపాల్స్‌తో డ్రాప్ అవుట్ విద్యార్థుల తల్లిదండ్రులను స్వయంగా కలిసి విద్య ప్రాముఖ్యతపై అవగాహన కల్పించి తిరిగి బడికి చేర్పించేలా అధికారులు చేపట్టిన సర్వే ప్రక్రియలో భాగంగా నివేదికలపై కలెక్టర్ మండలాల వారీగా సమీక్ష చేశారు. ఈ సమీక్షలో 19 కేటగిరిల్లో చేపట్టిన అంశాలను సమీక్షించారు. ఈ నెల 22వ తేదీకి స్పష్టమైన సమాచారంతో నివేదికను సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఇంటర్మీడియేట్‌లో కొంతమంది ప్రవేశించకపోవడానికి గల కారణాలను కళాశాలల ప్రిన్సిపాల్స్‌ను అడిగి తెలుసుకున్నారు ఈ కార్యక్రమంలో పిఓ ఐటిడిఏ యం.సూర్యతేజ, ఆర్ఐఓ కె. చంద్రశేఖర్, డిఇఓ శ్యామ్ సుందర్, డివిఇఓ బి. ప్రభాకర్, జిల్లాలోని మండల విద్యాశాఖాదికారులు, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు

జిల్లా ఎస్పి డి. మేరీ ప్రశాంతి

విశాలాంధ్ర-ఏలూరు క్రైమ్: విధి నిర్వహణలో పోలీసు సిబ్బంది సమస్యలు తొలగించి ప్రజలకు మెరు గైన సేవలు అందించేలా కృషి చేస్తామని జిల్లా ఎస్పి డి.మేరీ ప్రశాంతి అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో 'పోలీస్ సంక్షేమ దివస్ (గ్రీవెన్స్ డే) పోలీసు సిబ్బంది, శాఖాపరమైన సమస్యలపై సంక్షేమ దివాస్ నిర్వహించారు. జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్లు, విభాగాలలో విధులు నిర్వర్తిస్తున్న పోలీస్ సిబ్బంది, ఏ.అర్ సిబ్బంది హెూమ్ గార్డ్స్ సమస్యలు ఎస్పికి తెలిపారు. సిబ్బంది నుండి వినతులను స్వీకరించి, వారి సమస్యలను సమగ్రంగా అడిగి తెలుసుకుని వాటిపై సత్వరమే తగు పరిష్కార చర్యలు తీసుకుంటామని పోలీస్ సిబ్బందికి భరోసా కల్పించారు. ఆయా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత పోలీస్ ప్రధాన కార్యాలయం అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ విధి నిర్వహణలో నిమగ్నమైన సిబ్బంది సంక్షేమా నికి పెద్దపీటవేస్తూ పోలీస్ వెల్ఫేర్ డే కార్యక్రమం ద్వారా సిబ్బంది సమస్యలపై సత్వర చర్యలు తీసుకుని పరిష్కరిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో ఎన్.బి సిఐ ఎం.సుబ్బారావు, పోలీస్ ప్రధాన కార్యాలయం ఎ.సెక్షన్ సీనియర్ అసిస్టెంట్ సాల్మన్ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి లక్ష్యం

విశాలాంధ్ర -భీమవరం టౌన్ : అభివృద్ధి, సంక్షేమంలో భాగంగా గ్రామాలను, పట్టణాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. భీమవరం నియోజక వర్గంలో దళిత, దళిత క్రైస్తవ ప్రాంతాలలో ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులను దృష్టిలో పెట్టుకొని దళిత ఐక్యవేదిక నాయకులు శుక్రవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ గత నాలుగేళ్ల పాలనలో భీమవరం నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులను చేసినట్టు వెల్లడించారు. ప్రతి గ్రామం, ప్రతి వార్డులో ముఖ్యంగా సిసి రోడ్లు, డ్రైనేజీ సౌకర్యాలను కల్పించడం జరిగిందన్నారు. ప్రస్తుతం భీమవరం, వీరవాసరం మండలాలకు సంబంధించి ఎన్‌ఆర్‌జిఎస్ పథకంలో రూ.కోటి 20 లక్షల నిధులు మంజూరయ్యాయన్నారు. రెండేళ్లపాటు కరోనాతో రాష్ట్ర ఖజానా పూర్తిగా ఆర్థిక లోటు బడ్జెట్లోకి వెళ్లిందని, అయినప్పటికీ ఎన్నికలలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశామని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు గంటా సుందర్ కుమార్, పాలపర్తి జోనా, పట్టెం సుభాకర్, ఆలమూరి బాబ్జి, ఏలేటి సునీల్ కుమార్, ఆచంట ఆనంద్ కుమార్, గొల్లా రాజ్ కుమార్, తాటిపాక సుభాకర్, ఉండ్రు విల్సన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆరోగ్య బీమా కార్డుల పంపిణీ

విశాలాంధ్ర-కొయ్యలగూడెం : కన్వీనర్లకు,గృహ సారధులకు రూ.5 లక్షల బీమా హెల్త్ ఇన్సూరెన్స్ కార్డులను పోలవరం నియోజకవర్గ శాసనసభ్యులు తెల్లం బాలరాజు శనివారం కొయ్యలగూడెం పట్టణంలో వైయస్సార్ విగ్రహం వద్ద ఏర్పాటు చేయనున్న నియోజకవర్గస్థాయి సమావేశంలో అందజేయ నున్నట్టు కొయ్యలగూడెం మండల సచివాలయాల కోఆర్డినేటర్ నూకల రాము పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఉన్న కన్వీనర్లు, గృహ సారధులు ప్రతి ఒక్కరూ ఈ సమావేశానికి హాజరుకావాలని ఆయనకోరారు.

పాస్‌పోర్టు పోయినది

ఏలూరు జిల్లా నిడమర్రు మండలం బావాయ పాలెం గ్రామానికి చెందిన **ఉప్పుల పుష్ప రాణి భర్త ఉప్పుల మంగరాజు** అను నాకు పాస్ పోర్టు కలదు. పాస్‌పోర్టు నెంబర్ **U1860447.** గల పాస్‌పోర్టును ది. 12-08-2023వ తేదీన జిరాక్స్ నిమిత్తం ఒరిజినల్ పాస్‌పోర్టును బ్యాగులో పెట్టుకుని బావాయపాలెం మా ఇంటి వద్ద నుండి బువ్వనపల్లి వస్తుండగా మార్గమధ్యలో పడిపోయినది. ఎవరికైనా దొరికిన ఎడల నా అడ్రస్ అందజేయగలరు.

ఉప్పుల పుష్పరాణి, భర్త మంగరాజు,
డోర్ నెంబర్ 1-35 రామాలయం వీధి
బావాయపాలెం, నిడమర్రు మండలం
ఏలూరు జిల్లా - 534198,
సెల్ నెంబర్: 9963593120

వణుదుర్రు సర్పంచ్ ఎన్నికకు సర్వం సిద్ధం

విశాలాంధ్ర-ముదినేపల్లి : ముదినేపల్లి మండలం వణుదుర్రు గ్రామ సర్పంచ్ ఉప ఎన్నికకు సర్వం సిద్ధం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుండి పోలింగ్ సిబ్బంది ఎన్నికల సామాగ్రితో వణుదుర్రు చేరుకున్నారు. వణుదుర్రు గ్రామంలో సర్పంచ్ ఎన్నికకు కొత్తపల్లితో నాలుగు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇక్కడ 1613 ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇక్కడ నలుగురు అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఇక్కడ సర్పంచ్ ఎన్నిక బరిలో ఉన్న అభ్యర్థులు వారిని బలపరిచిన ప్రధాన పక్షాలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. మండలంలోని పెయ్యేరు 2వ వార్డు ఎన్నిక ఏకగ్రీవమైంది. సర్పంచ్ ఎన్నిక పైన మండల ప్రజలు దృష్టి కేంద్రీకరించారు.

మంచినీటి పంపింగ్‌పై పర్యవేక్షణ

విశాలాంధ్ర -భీమవరం టౌన్ :పట్టణంలో భారీ సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ (మంచినీటి చెరువు) నుండి పైపులైన్ ద్వారా ఓహెచ్ఆర్ లకు త్రాగునీరు పంపింగ్‌కు నిత్యం పర్యవేక్షణ ఉంటుందని దీనికి సంబంధించి సీసీ కెమెరాలను ఓ హెచ్ ఆర్ ల లోపల ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మున్సిపల్ అధికారులతో సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని శివారు ప్రాంతాలలో కొన్నిచోట్ల త్రాగునీరు అందడం లేదని ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో అధికారులతో సమీక్ష చేసినటువంటి తెలిపారు. పంపింగ్ విధానంలో అక్కడక్కడ లోపాలు ఉన్నట్లు గుర్తించడం జరిగిందని, ఇందుకోసం ఓ హెచ్ ఆర్ ల లోపల సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని, దీనివల్ల రోజులో పంపింగ్ ఎంత జరిగిందనేది తెలుస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం వర్షాకాలం అయినప్పటికీ కూడా శివారు ప్రాంతాల్లోని కొన్నిచోట్ల త్రాగునీటి ఇబ్బంది ఉండడంతో ఆ ప్రాంతాలకు వాటర్ ట్యాంకులను పంపిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.

విద్యను కార్పొరేటీకరణ చేస్తున్న పాలకులు

విశాలాంధ్ర-ఏలూరు: కొత్త బస్టాండ్ సమీపంలోని అల్లూరు సత్యనారాయణ భవన్ లో పిడిఎస్ రాష్ట్ర జనరల్ బాడీ సమావేశం ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.భాస్కర్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన వక్తగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. పాండురంగ వరప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యాసంస్కరణల పేరుతో విద్యా రంగంలో అనేక మార్పులను తీసుకువస్తూ విద్యను మొత్తంగా కార్పొరేట్ల పరం చేసేందుకు ప్రయత్నాలు ముమ్మరంగా సాగిస్తున్నారని అన్నారు. దానిలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఎన్ఇ పి - 20 20 తీసుకొచ్చిందన్నారు. అన్ని రాష్ట్రాల కంటే ముందుగా మన రాష్ట్రంలో అమలు చేస్తూ పాఠశాల విలీనం, సీబీఎస్ఈ సిలబస్, తెలుగు మీడియం రద్దు, సెమిస్టర్ విధానం వంటి వాటిని అమలు చేస్తున్నారన్నారు. మరోవైపు హేతుబద్ధీకరణ పేరుతో టీచర్ పోస్టులు రద్దు చేసి ఉన్న టీచర్లకు అధ్యాపకేతర పనులు అప్పగించి ఉపాధ్యాయులను తరగతి నుండి దూరం చేస్తున్నారని విమర్శించారు.

పిడిఎస్ఓ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ. సురేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల 107,108 జీవోలు తీసుకొచ్చి పేద, దళిత, ఆదివాసి విద్యార్థుల వైద్య విద్యా అవకాశాలను దెబ్బతీస్తూ వైద్య విద్య ను అత్యంత ఖరీదైన సరుకుగా మారుస్తుందని విమర్శించారు. ఈ జీవోలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నవ యువ సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కె.భాషా మాట్లాడుతూ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2లక్షల 30 వేల పోస్టులను, కేంద్రంలో ఉన్న 60 లక్షల పోస్టులను కేంద్ర, రాష్ట్ర పాలకులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. జనరల్ బాడీ సమావేశానికి రాష్ట్రంలోని పలు జిల్లాల నుండి 150 మంది విద్యార్థినీ,విద్యార్థులు పాల్గొన్నారు.తదనంతరం ప్రభుత్వ వైద్య కళాశాలలో సెల్ఫ్ ఫైనాన్స్ పేరుతో వైద్య సీట్ల అమ్మకాన్ని వ్యతిరేకిస్తూ కొత్త బస్టాండ్ నుండి ఫైర్ స్టేషన్ వరకు నిరసన ప్రదర్శన చేపట్టారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన అధికారులు

విశాలాంధ్ర-ఉంగుటూరు:ఉంగుటూరు మండలం కాకర్లమూడి గ్రామపంచా యతీలో 1,5 వార్డులకు శనివారం ఉప ఎన్నికలు జరుగుతున్నాయి. ఆ వార్డులకు సంబంధించి రెండు ఎన్నికల పోలింగ్ కేంద్రాలను శుక్రవారం అధికారులు పరిశీలించారు. ఉంగుటూరు తహసీల్దార్ ఏవి రమణారావు, ఇన్‌చార్జి ఎంపీడీవో అంజనేయబాబు, ఈవోపీఆర్డి షేక్ సంసిద్దిన్ పరిశీలించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల సిబ్బందికి ఎన్నికల సామాగ్రిని అందజేశారు. ఒక్కొక్క వార్డుకు 140 మంది ఓటర్లు ఉన్నారు. ఒక్కొక్క వార్డుకు ఇద్దరు అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. రెండు వార్డులకు ఎన్నికల ఏర్పాట్లు పూర్తి చేసామని అధికారులు తెలిపారు. రెవిన్యూ, సిబ్బంది కూడా ఉన్నారు. వార్డుల ఉప ఎన్నికల సందర్భంగా కాకర్లమూడి గ్రామంలో 144 సెక్షన్ అమల్లో ఉంది. పోలీసు సిబ్బంది, సచివాలయ మహిళ పోలీసులు కాకర్లమూడి గ్రామానికి చేరుకున్నారు. వార్డు ఉప ఎన్ని కల్లో ప్రశాంతంగా జరిగేందుకు అధికారులు పటిష్టమైన ఏర్పాటు చేశారు.

సిసి రోడ్డు నిర్మాణం

విశాలాంధ్ర-ఆకివీడు : దశాబ్దాల కాలం నుండి సుదీర్ఘ నిరీక్షణతో ఆకివీడు నగర పంచాయతీ పదో వార్డ్ లోని గంగానమ్మ కోడు వీధి శివారులో సుమారు 106 మీటర్ల సిసి రోడ్డును నిర్మించడం పట్ల అక్కడ ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. నరసాపురం పార్లమెంట్ సభ్యులు రఘురామకృష్ణం రాజు నిధుల నుండి రూ.10లక్షలు ఈ సి సి రోడ్డు నిర్మాణానికి కేటాయించారు. అవార్డు వైసిపి ఇన్‌చార్జి జోగి నాగరాజు, కాంట్రాక్టర్ మార్గాన్ని కనక దుర్గారావు, వలంటరీ ఈరి శ్యామ్ రోడ్డు నిర్మాణ పనులను దగ్గరుండి పరిశీలించారు.

అధునాతన సాంకేతికతతో నూతన ఆవిష్కరణలు

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం రూరల్ :అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో నూతన ఆవిష్కరణల వైపు విద్యార్థులు అడుగులు వేయాలని వాసవి ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్ష కార్యదర్శులు గ్రంథి సత్యనారాయణ, చలంచర్ల సుబ్బారావు అన్నారు. వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో లేటరల్ ఎంట్రీ ద్వారా బి టెక్. రెండవ సంవత్సరంలో ప్రవేశాలు తీసుకున్న విద్యార్థులకు వారం పది రోజుల పాటు నిర్వహించనున్న బ్రిడ్జి కోర్సు శిక్షణను శుక్రవారం ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల పాలక వర్గ అధ్యక్ష, కార్యదర్శులు గ్రంథి సత్యనారాయణ, చలంచర్ల సుబ్బారావులు మాట్లాడుతూ మూడు సంవత్సరాల పాలిటెక్నిక్ కోర్సును పూర్తి చేసుకుని ఈసెట్ పరీక్ష వ్రాసి ఉత్తీర్ణులై కౌన్సెలింగ్ ద్వారా నేరుగా బి.టెక్. రెండవ సంవత్సరంలో ప్రవేశించే మీరు ఇంజనీరింగ్ ప్రథమ సంవత్సరం విద్యార్థుల కంటే ఎక్కువ పరిజ్ఞానాన్ని సంపాదించుకుని ఉంటారని దానిని కొనసాగిస్తూ చక్కగా చదువుకోగలిగితే మంచి భవిష్యత్తును సాధించడం సులువు అవుతుందన్నారు. క్రమశిక్షణతో కూడిన జీవితాన్ని అలవాటు చేసుకున్నట్లయితే భవిష్యత్తులో కూడా ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కొనే సామర్థ్యాన్ని కలిగి ఉండగలరన్నారు. కొన్ని ప్రత్యేక పాఠ్యాంశాలలో ప్రథమ సంవత్సరం విద్యార్థులకు యిచ్చిన శిక్షణను మీరు మిస్ అవకూడదనే ఉద్దేశ్యంతో రెండవ సంవత్సరం తరగతులు ప్రారంభానికి ముందే మీకు కూడా ఆయా అంశాలపై శిక్షణను అందించడం జరుగుతోందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రత్నాకర్ రావు, టెక్నికల్ డైరెక్టర్ చక్కా అప్పారావు, డీన్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ రాంబాబు అధ్యాపకులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

టిడిపి తోనే రాష్ట్రం అభివృద్ధి

విశాలాంధ్ర-ఆకివీడు : టిడిపి తోనే అభివృద్ధి సాధ్యమని టిడిపి నాయకులు పేర్కొన్నారు. ఆకివీడు మండలం కోళ్లపర్రు గ్రామంలో శుక్రవారం మహాశక్తి కార్యక్రమంలో భాగంగా టిడిపి మేనిఫెస్టోను విస్తృత ప్రచారం చేశారు. గ్రామంలోని ఇంటింటికి వెళ్లి కరపత్రాలను అందజేసి మేనిఫెస్టో వివరించారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా అధికారం చేపడితేనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ప్రస్తుతం ఇబ్బందులను వివరిస్తూ రానున్న కాలంలో అభివృద్ధి వైపు పయనించేలా ప్రజలంతా చంద్రబాబుకు మద్దతు పలకాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఆకివీడు పట్టణ అధ్యక్షుడు బొల్లా వెంకట్రావు, భూపతి రాజు తిమ్మరాజు, ఆకివీడు నగర పంచాయతీ కౌన్సిలర్లు కిమిడి అరుణకుమారి, బత్తుల శ్యామల, కిమిడి నాగరాజు, మోపిదేవి శ్రీను, బత్తుల రవి, మీగడ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే సంక్షేమం, అభివృద్ధి

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం : జగనన్నతోనే సంక్షేమం,అభివృద్ధి సాధ్యమని, 2024 ఎన్నికల్లోను వైకాపా విజయం సాధించి వైయస్ జగన్మోహన్ రెడ్డి మళ్ళీ ముఖ్యమంత్రి అయితేనే సంక్షేమ ప్రభుత్వం ఇలాగే కొనసాగుతుందని ప్రజలకు చాటి చెప్పాలని జగనన్న సచివాలయం కన్వీనర్లు (జె సి ఎస్) కు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి (దేవాదాయ, ధర్మాదాయ శాఖ) కొట్టు సత్యనారాయణ పిలుపునిచ్చారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గ వైకాపా కార్యాలయంలో శుక్రవారం జరిగిన జె సి ఎస్ శిక్షణా శిబిరంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్య మంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అవసరం ఏమిటనేది ప్రజలకు వివరించి చెప్పాలన్నారు. పిల్లలను చదివించే తల్లులకు అమ్మ ఒడి రావాలన్నా, ఉన్నత విద్యను అభ్యసించే వారికి విద్యా,వసతి దీవెన కావాలన్నా, రైతన్నలకు రైతు భరోసా ఇవ్వాలన్నా, 45-60 సంవత్సరాల మధ్య వయసు కలిగిన మహిళలకు కాపు నేస్తం, ఈ బీసీ నేస్తం కొనసాగాలన్న, పేదవాడు సొంత ఇంటి కల నెరవేరడానికి, అవ్వ తాతలకు పెన్షన్లు ఇవ్వడానికి ఇలా చెప్పుకుంటూ పోతే అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు జరగడానికి ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అవసరం ఉందనేది ప్రతి ఒక్కరికి సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు ఇంటింటికి వెళ్లి చాటి చెప్పాలని మంత్రి కొట్టు సూచించారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం మండలం గ్రామ సచివాల యాల కన్వీనర్ ముప్పిడి సంపత్ కుమార్, తాడేపల్లిగూడెం పట్టణం వన్ టౌన్ వార్డు సచివాలయాల కన్వీనర్ కొలుకులూరి ధర్మరాజు, టూ టౌన్ వార్డు సచివాలయాల కన్వీనర్ కర్రి భాస్కరరావు, పెంటపాడు మండలం గ్రామ సచివాలయాల కన్వీనర్ మైలవరపు పలువురు గ్రామ సర్పంచులు, ఎంపీటీసీలు, సొసైటీల చైర్మన్లు, వార్డు ఇన్చార్జిలు, గ్రామ,వార్డు సచివా లయాల కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్య కళాశాలలో మెడిసిన్ సీట్ల అమ్మకాన్ని ఆపాలి

విశాలాంధ్ర-పెంటపాడు: మానవత స్వచ్ఛంద సంస్థ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని ఈనెల 16వ తేదీ నుండి 22 వ తేదీ వరకు నిర్వహించు వారోత్స వాలలో భాగంగా శుక్రవారం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పెంటపాడు రూరల్ సిఐ వివిఎస్ మూర్తి మానవత శాంతి ర్యాలీని పెంటపాడులోని ఎస్ టి వి ఎన్ హెచ్ పాఠశాల వద్ద ప్రారంభించారు. 250 మంది పాఠశాల విద్యార్థులతోను, మానవత సభ్యులతోను, ప్రపంచ శాంతిని ఆకాంక్షిస్తూ ర్యాలీ కొనసాగుతూ పెంటపాడు గాంధీ బొమ్మ సెంటరు వద్ద మానవహారంగా ఏర్పడి మానవత శాంతి నినాదాలతోను, పర్యావరణ పరిరక్షణ కొరకు, విద్య ఆవశ్యత, పరిశుభ్రత కోసం నినదిస్తూ, విద్యార్థులు ప్లైకార్డులు , మానవత జెండాలతోను ఘనంగా ర్యాలీ నిర్వహించారు. బజార్ సెంటర్ నుండి ప్రభుత్వ పోస్ట్ బేసిక్ పాఠశాల వరకు సాగింది. మానవత సభ్యులతో మానవత ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా చైర్మన్ తాడేపల్లి మోహన రావు శాంతి ప్రతిజ్ఞను చేయించారు. ర్యాలీ ముగిసిన అనంతరం విద్యార్థులకు బిస్కెట్లు, లేస్ ప్యాకెట్లు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు, టీచర్స్ శశి కపూర్ ,మానవత సభ్యులు టి.పాల్, వై. వీరాస్వామి, ఎన్ . ప్రభాకర రెడ్డి, జార్జ్ జి. కృష్ణ మోహన్ ,కె. నారాయణ రావు, మానుకొండ మార్కు,జి. శ్రీనివాస్ ,స్కూలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బహుజన వీరుడు సర్వాయి పాపన్న గౌడ్

విశాలాంధ్ర-కైకలూరు : రాచరికపు వ్యవస్థ నీడలో జమీందార్లు, జాగీర్దాల అరాచకాలను సహించలేక కడుపు మండి కత్తి పట్టిన వీరుడని,దళిత, బహుజనులు ఏకమై పోరాడితేనే రాజ్యాధికారం సాధించవచ్చని నిరూపించిన సామాన్యుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ అని రాష్ట్ర గౌడ సంఘ అధ్యక్షులు పోసిన చెంచు రామారావు తెలిపారు. పట్టణం లోని తాలూకా సెంటర్లోని గౌతు లచ్చన్న విగ్రహం వద్ద సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ 373వ జయంతి వేడుకలు కైకలూరు నియోజకవర్గ గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శాసన మండలి సభ్యులు జయమంగళ వెంకటరమణ ముఖ్య అతిథిగా హాజరై సర్వాయి పాపన్న గౌడ్ ఖ్యాతిని వివరించారు. జై గౌడ ఉద్యమ రాష్ట్ర కార్యదర్శి పరసా ఏడుకొండలు మాట్లాడుతూ కైకలూరు పట్టణంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్, కాళ్లపాలెం డాక్టర్ విగ్రహాలను ఏర్పాటు చేయడానికి అనుమతులు మంజూరు చేయడానికి స్థానిక నేతలు కృషి చేయాలని విన్నవించారు. సభాధ్యక్షులు కైకలూరు మండల ప్రధాన కార్యదర్శి మారగాని గణపతి మాట్లాడుతూ గౌడ సంఘాన్ని బలోపేతం చేయాలని దాని దిశగానే మండల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయాలని కోరారు. సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని పురస్కరించుకుని సాయంత్రం కలిదిండి మండలం ఎస్ ఆర్ పి అగ్రహారంలో అన్నదానం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి కృష్ణాజిల్లా అధ్యక్షులు యార్లగడ్డ గోవర్ధన్,బొల్లా శ్యామల రాజు గౌడ్, కైకలూరు నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు పోలగాని నాగరాజు, గోనెపాడు సర్పంచ్ బత్తిన శ్రీకాంత్, నంగెడ్డ శివ, దాసరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన

విశాలాంధ్ర-వీరవాసరం: రహదారి ప్రమాదాల నివారణకు రోడ్డు భద్రత సూచనలను ప్రతి ఒక్కరు పాటించాలని ఏఎస్పి ఏవి.సుబ్బరాజు తెలిపారు. మండలంలోని రాయకుదురులో చట్టాలపై ప్రత్యేక అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారిపై ప్రయాణం చేస్తున్నప్పుడు సీట్ బెల్ట్ లను, హెల్మెట్లను తప్పనిసరిగా ధరించాలన్నారు. పోలీసులకు, ప్రజలకు మధ్య ఫ్రెండ్లీ వాతావరణం ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రతి ఒక్కరు నడుచుకోవాలన్నారు. గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటన చోటు చేసుకున్నా, అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నా పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో వీరవాసరం ఎస్ఐ పి.రమేష్, గెద్దం భాస్కరరావు, సర్వేశ్వరరావు, పివి రామకృష్ణ, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, తాడాల దుర్గా ప్రసాద్, తోట పెద్దిరాజు, వెలిదిండి దయానంద్, చెల్లబోయిన రామలింగేశ్వర రావు, సింహాద్రి సాయి రాజేష్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వేడంగి పంచాయతీలో డస్ట్ బిన్లు పంపిణీ



విశాలాంధ్ర-పోడూరు: మండలంలోని వేడంగిలో స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా పంచాయతీ ఇంటింటికీ డస్ట్ బిన్లు పంపిణీ కార్యక్రమాన్ని నియోజక వర్గ వైసీపీ ఇన్ చార్జ్ గుడాల గోపి శుక్రవారం పంచాయతీ కార్యాలయం వద్ద స్థానిక మహిళలకు డస్ట్ బిన్లు అందచేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటా చెత్త సేకరణకు పంచాయతీ అందచేస్తున్న డస్ట్ బిన్ లు ఉపయోగిస్తూ గ్రామం పరిశుభ్రంగా ఉండేందుకు ప్రజలు తమ తోడ్పాటు నందించాల న్నారు. నియోజకవర్గం వైసీపీ నాయకులు గుణ్ణం నాగబాబు, యెడ్ల తాతాజీ ,పోడూరు జడ్పిటీసి గుంటూరి పెద్దిరాజు, ఎంపీపీ సబ్బితి సుమంగళి, సర్పంచ్ చెల్లబోయిన శారద తదితరులు పాల్గొన్నారు.

ఉచిత దంత వైద్య శిబిరం

విశాలాంధ్ర-పెనుమంట్ర:పెనుమంట్ర మండల మానవత సంస్థ ,రత్న డెంటల్ క్లినిక్ పెనుగొండ వారి అధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిభిరం పెనుమంట్ర గ్రామంలో శ్రీ గౌతమి స్కూల్ నందు శుక్రవారం ఏర్పాటు చేశారు. సుమారు 150 విద్యార్థిని విద్యార్థుల కు ఉచితం గా దంత పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. శిబిరం లో డాక్టర్ మేడపాటి మురళీ జోగిరెడ్డి, డాక్టర్ షాలిని రెడ్డి, మానవత అధ్యక్షులు బాణాల శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి కొత్త సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

ఉద్యోగులు ప్రజలకోసం పనిచేయాలి

విశాలాంధ్ర -దేవరపల్లి: కృషి, పట్టుదల, ఆత్మస్థైర్యం ఉంటే అవార్డులు వరిస్తాయని ఈ విషయంలో ప్రతి ఉద్యోగి ప్రజల కోసం పనిచేయాలని దేవరపల్లి ఎంపీపీ కేవీకే దుర్గారావు పేర్కొన్నారు. దేవరపల్లి మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా ఉత్తమ ఎంపీడీవో అవార్డు అందుకున్న దేవరపల్లి ఎంపీడీవో కృష్ణంరాజును కార్యాలయ సిబ్బంది రాజకీయ ప్రముఖులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎంపీపీ దుర్గారావు మాట్లాడుతూ కృష్ణంరాజు 15 సంవత్సరాల పాటు మండల పరిషత్ సూపరింటెండెంట్‌గా పనిచేసిన అనుభవంతో ఎంపీడీవో గా ప్రజలకు మరిన్ని సేవలు అందిస్తున్నారని అన్నారు. కృష్ణంరాజు సేవలు దేవరపల్లి మండల పరిషత్‌కు ఎంతో అవసరమని అన్నారు. జడ్పిటిసి పొట్టి స్వర్ణలత, గోపాలపురం ఏఎంసీ చైర్మన్ జనార్ధన రావు దేవరపల్లి మండల వైసీపీ అధ్యక్షుడు కూచిపూడి సతీష్ లు కృష్ణంరాజు చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా మండల పరిషత్ సిబ్బంది ఎంపీపీ కేవీకే దుర్గారావు ఎఎంసి చైర్మన్ జనార్ధన రావు మండల వైసీపీ అధ్యక్షుడు కూచిపూడి సతీష్ వైఎస్ ఎంపీపీలు కొర్లపాటి అరుణ సాది సుబ్బారావు గ్రామ కార్యదర్శులు ఘనంగా సత్కరించారు.

నారాయణపురంలో శాంతి ర్యాలీ

విశాలాంధ్ర-ఉంగుటూరు: ఉంగుటూరు మండలం నారాయణపురంలో మానవత ఆవిర్భావం సందర్భంగా శుక్రవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ ఉషోదయ హైస్కూల్ నుంచి జాతీయ రహదారి వరకు జరిగింది. రీజియన్ చైర్మన్ పుప్పాల గోపి, మండల చైర్మన్ గుణ్ణం బుల్లబ్బాయి, అధ్యక్షులు గంజి రవి, అడపా శ్రీనివాసరావు, బొమ్మిడి అప్పారావు, సూర్యనారాయణ రాజు, అడపా శోభారాణి, పిళ్ళ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మా భూములు మాకు ఇప్పించండి

విశాలాంధ్ర-జీలుగుమిల్లి : గత 20 సంవత్సరాలుగా స్థానిక గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములకు అన్ని హక్కులు ఉన్నా నిర్వాసి తులు అడ్డుపడుతున్నారని ఆదివాసి సేన రాష్ట్ర అధ్యక్షులు మడకం వెంకటేశ్వరరావు విమర్శించారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద గిరిజనులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పి. అంకంపాలెం పంచాయతీ పరిధిలో పి. నారాయణపురం గ్రామంలో 2003 సంవత్సరంలో స్థానిక గిరిజనులకు పట్టాలి ఇచ్చారని అన్నారు. అప్పటి నుండి గిరిజనులు సాగు చేసుకుంటుంటే గాజుల గుంది నిర్వాసితులు ఇప్పుడు అడ్డు వస్తున్నారన్నారు. హైకోర్టు ఆర్డర్లు ఉన్న మాకు న్యాయం జరగడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మీరే న్యాయం చేయాలి అని కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. 1/70 చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక గిరిజనులు పాల్గొన్నారు.

గుంతలకు దిక్కులేదు

విశాలాంధ్ర -భీమవరం: జగన్ రాష్ట్రంలో రోడ్లు కాదు కదా గుంతలను కూడా పూడ్చలేకపోతున్నాడని మూడు రాజధానులు ఎలా నిర్మిస్తాడని టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి ప్రశ్నించారు. శిథిలావస్థకు చేరిన బలుసుమూడి-కొమరాడ రోడ్డు వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో టిడిపి నాయకులు సెల్ఫీ ఫోటోలతో సోషల్ మీడియాలో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వ హయాంలో 90 శాతం నిర్మాణాలు జరిగినటువంటి టిడ్కో ఇళ్లు, పోలవరం ఇతర ప్రాజెక్టులను నాలుగేళ్లవుతున్నా పూర్తి చేయలేని అసమర్ధపు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం శంకుస్థాపనలతో కాలయాపన చేస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షుడు ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు, మాజీ కౌన్సిలర్ పామర్తి వెంకటరామయ్య, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి మైలాబత్తుల ఐజాక్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలతోనే ఉపాధి అవకాశాలు

విశాలాంధ్ర - రాజానగరం : ప్రస్తుత పోటీ ప్రపంచంలో నైపుణ్యాలతోనే ఉపాధి అవకాశాలు లభిస్తున్నయనీ, అందుచే విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకో వాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యా లయం ఉపకులపతి ఆచార్య కె.పద్మ రాజు అన్నారు. నన్నయ వర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, బిట్ క్లబ్ ఆధ్వర్యంలో "అప్ స్కిల్" అనే అంశంపై శుక్రవారం జరిగిన అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విసి మాట్లాడుతూ సమాజంలో ఉన్నత స్థానాలకు చేరడానికి మంచి లక్షణాలను, విలువలను అలవర్చుకోవాలన్నారు. విద్యతో పాటు వివిధ స్కిల్స్ ను పెంచు కోవాలని, ఇంటర్వ్యూల సమయంలో వాటి ఆధారంగానే ఉద్యోగాలు లభిస్తాయని ఉదాహరణలతో వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వెంకటేశ్వరరావు, డీన్ అకడమిక్ అఫైర్స్ ఆచార్య పి.సురేష్ వర్మ, ఐక్యూ.ఎ.సి డైరెక్టర్ డాక్టర్ వి.పెర్సిస్, విభాగాధిపతి డాక్టర్ బి.కెజియారాణి, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డి.దాసు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై చంద్రబాబుకు వినతిపత్రం

విశాలాంధ్ర - మండపేట : మాజీ సీఎం, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పర్యటనలో భాగంగా మండపేట విచ్చేసిన సందర్భంగా రాష్ట్రంలో నెలకొన్న సమస్యలను వివరించడానికి ఏపీ ఎమ్మార్పీఎస్ఎస్ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు బుంగ సంజయ్ మాదిగ ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు సంజయ్ వెంట రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బజ్జింకి సుధాకర్ మాదిగ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాండ్రకోట తిమోతి మాదిగ, కాకినాడ జిల్లా ఇన్‌చార్జి తాతపూడి మూర్తి, తూర్పుగోదావరి జిల్లా ఇన్ చార్జి కందుకూరి రాజు మాదిగ, యువసేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లిపూడి రాజు మాదిగ తదితరులున్నారు.

చంద్రబాబును కలిసిన జయరాజు

విశాలాంధ్ర - మండపేట : మండపేట పర్యటనలో ఉన్న మాజీ సీఎం, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడును ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి దూలి జయరాజు మాదిగ కలిసి వినతిపత్రం అందజేసారు. సామాజిక న్యాయమైన ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించే విధంగా కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి లేఖ రాయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నాయకులు గాలింకి నాగేశ్వరావు, దూలి ప్రవీణ్, టీడీపీ నాయకులు చాపల వీరబాబు, పెందుర్తి ప్రదీప్, మచ్చ రాంబాబు, సిరంగుల రాజు, రాయి దొరబాబు, కొడమంచిలి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కరపలో ఫ్రైడే డ్రై డే

విశాలాంధ్ర - కరప : కరప గ్రామంలో వివిధ కాలనీలలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ఎంపిహెచ్ఓలు, హెచ్ వీలు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు ఆధ్వర్యంలో నిర్వహించుట జరిగిందని మండల మెడికల్ ఆఫీసర్ శ్రీనివాస్ నాయక్ పేర్కొన్నారు. కాలనీలలో ఉన్న డ్రైనేజీలలో దోమల వ్యాప్తి చెందకుండా మందులు పిచికారి చేయుట, నాఫ్తలిన్ పిల్స్ వేయుట, ఇంటి ఆవరణలో ఉన్న చెత్తాచెదారం తొలగించి, కొబ్బరి బొండాలు, టైర్లు, రుబ్బురోలు నిలవ నీరు ఉండే ప్రదేశాలు లేకుండా, సూపర్ పలుచుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. తడిగా ఉండే ప్రదేశాలలో బ్లీచింగ్ ముగ్గు వంటి పౌడర్లను చల్లడం జరిగిందన్నారు.

దొంగ అరెస్ట్

విశాలాంధ్ర - సామర్లకోట : సామర్లకోట పట్టణం సత్యనారాయణపురంలో మహిళ మెడలో బంగారు తాడు దొంగలించి చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్న దొంగను ట్రాఫిక్ పోలీసులు చాకచక్యంగా పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం ఉదయం 10:30 గంటల సమయంలో సామర్లకోట సత్యనారాయణపురం ప్రాంతానికి చెందిన మహిళలు రైల్వే స్టేషన్‌కు నడిచి వెళుతుండగా రైల్వే ఓవర్ బ్రిడ్జి కిందకు రాగా అప్పటికే పొంచి ఉన్న దొంగ ఒక మహిళ మెడలోని బంగారు పుస్తెలతాడును తెంపుకొని పారిపోతుండగా. మహిళ కేకలు పెట్టడంతో వంతెనపై ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న పోలీసులు తక్షణమే స్పందించి మోటారు సైకిళ్లపై వెళ్లి దొంగను వెంటాడి పట్టుకున్నారు. చోరీకి పాల్పడిన వ్యక్తి కాకినాడ రూరల్ మండలం సర్పవరం గ్రామానికి చెందినవాడిగా గుర్తించామని, అతడు పాత నేరస్థుడు అని ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావు చెప్పారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కార్మికులకు చట్టాలపై సదస్సు

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం రూరల్: శుక్రవారం తూర్పు గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ వారు లేబర్ డిపార్ట్మెంట్ వారి సమన్వయంతో స్థానిక ఆటోనగర్‌లోని ది రాజమండ్రి పట్టణ మోటార్ మెకానిక్స్ వెల్ ఫేర్ అసోసియేషన్ బిల్డింగ్‌లో దుకాణాలలో పనిచేస్తున్న కార్మికుల చట్టాల కోసం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె. ప్రత్యూష కుమారి ఆధ్వర్యంలో కార్మిక హక్కులు, వివిధ కార్మిక చట్టాల గురించి వివరించారు. కార్మికులు భద్రతా ప్రమాణాలను పాటిస్తూ పని చేయాలని సూచించారు. రాజ్యాంగంలో పొందుపరచిన ఉచిత, నిర్బంధ విద్యహక్కు చట్టం 2009 ప్రకారం 6 నుండి 14 ఏళ్ల వయస్సు ఉన్న పిల్లలకు ఉచిత నిర్బంధ విద్య పొందడం వారి హక్కు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లేబర్ డిపార్ట్మెంట్ సిబ్బంది ఎ. విజయ ప్రకాష్, ఎ. ఎల్.ఒ. ఎం. లలిత కుమారి, ఇతర ఎ. ఎల్.ఒ లు, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో ప్రత్యేక వైద్య సేవలు

విశాలాంధ్ర - ఉండ్రాజవరం: ఉండ్రాజవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మూడవ శుక్రవారం స్పెషలిస్ట్ డాక్టర్లు వైద్య సేవలు అందించినట్లు వైద్యాధికారి డాక్టర్ ఆర్ ప్రసాద్ తెలిపారు. ప్రసూతి స్త్రీల వైద్య నిపుణులు డాక్టర్ మృదుల 12 మందిని, చెస్ట్ స్పెషలిస్ట్ డాక్టర్ మేరి వసంత నలుగురిని పరీక్షించి, తగిన సూచనలు అందించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి నెలలో మూడవ శుక్రవారం, నెలలో ప్రతి శనివారం స్పెషలిస్ట్ వైద్య సేవలు ఆరోగ్య కేంద్రంలో అందజేస్తున్నట్లు, ఆయా సంబంధిత అనారోగ్యం కలిగిన వారు తప్పనిసరిగా ఈ సేవలను ఉపయోగించుకోవచ్చన్నారు.

గ్రామ చరిత్ర గ్రంథస్తం అభినందనీయం



విశాలాంధ్ర - అనపర్తి: అనపర్తి గ్రామ చరిత్రను గ్రంథస్తం చేయడం అభినందనీయమని ఈవిధంగా ప్రతీ గ్రామ చరిత్ర గ్రంథస్తం చేయాల్సిన అవసరం ఉందని గ్రామ సర్పంచ్ వారా కుమారి, పంచాయతీ కార్యదర్శి మల్లిడి విజయ్ రెడ్డి అన్నారు. ఇటీవల ఉత్తమ రచయిత అవార్డ్ జిల్లా కలెక్టర్ డాక్టర్ కె మాధవీలత, జిల్లా ఇన్చార్జ్ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణు గోపాల కృష్ణ చేతులు మీదగా అందుకున్న సీనియర్ పాత్రికేయులు,సామాజిక, ఆధ్యాత్మిక రచయిత పి.సాయిప్రకాష్ ను స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ ఆధ్వర్యంలో అనపర్తి పంచాయతీ, సచివాలయ సిబ్బంది ఘనంగా సత్కరించారు.

రీ సర్వేలో ప్రగతి సాధించాలి

విశాలాంధ్ర-భీమవరం: రీ సర్వేలో పశ్చిమగోదావరి జిల్లా మంచి ప్రగతిని సాధించాలని జిల్లా జాయింటు కలెక్టర్ రామ్ సుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి రీ సర్వే, భూమి బదిలీ హక్కులు కల్పించుటపై జిల్లాలోని రెవెన్యూ డివిజన్ అధికారులు, తహసిల్దార్లు, మండల సర్వే అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రీ సర్వేలో తీసుకోవలసిన జాగ్రత్తలపై సూచించారు. ప్రతి రైతుకి నోటీస్ అందించాలని తహసీల్దారులకు తెలిపారు. తొలి విడత రీ సర్వేలో పశ్చిమగోదావరి జిల్లా మంచి ప్రగతిని సాధించిందని, రెండో విడతలో కూడా ఇదే స్ఫూర్తిని కొనసాగించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా రెవిన్యూ అధికారి కె.కృష్ణవేణి, జిల్లా సర్వే అధికారి జాషువా, భూ విభాగం పర్యవేక్షకులు సిహెచ్. రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

నవోదయకు దరఖాస్తులు చేసుకోండి

విశాలాంధ్ర -భీమవరం: జవహర్ నవోదయ విద్యాలయాల్లో వచ్చే విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశాలు పొందడానికి జిల్లాలోని అన్ని పాఠశాలల్లో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులను సమాయత్తం చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ ఆదేశాలు ఇచ్చారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జవహర్ నవోదయ స్కూల్లో 20-1-2024వ తేదీన ఎంట్రన్స్ పరీక్ష నిర్వహిస్తారని, వీటికి ఈ నెల 25వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు జవహర్ నవోదయ.గవ్.ఇన్ వెబ్ సైట్ లో సందర్శించాలని ఆయన సూచించారు. జిల్లాలోని ఎంఇఒలు తమ పరిధిలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు వీటిపై అవగాహన కలిగించాలని ఆయన ఆదేశించారు.